క్లుప్తంగా

మాజీ సీఎం కోట్లకు నివాళి

మచిలీపట్నంటౌన్: ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి తారసాని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతిని శనివారం స్థానిక ఈడేపల్లి కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆ సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్రమణ్యం మాట్లాడుతూ విజయ భాస్కర్‌రెడ్డి 14 శాతం రిజర్వేషన్ పెంచడం వల్ల రాజకీయంగా బీసీలకు లబ్ధి చేకూరిందన్నారు. అందువల్ల బీసీలు కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని సుబ్రమణ్యం అన్నారు. నాయకులు కోమటి శ్రీను, జోగి శివ, భోగిరెడ్డి సుభాని, నిక్కు రాధాకృష్ణ, అన్సారి, ఎస్.రామరాజు, ఎం.అమీన్, సీహెచ్ రాము, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలి

పెడన: మండల పరిధిలోని ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాల్సిందేనని, అలా చేసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏవో ఎస్.జెన్నీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఈ పంట నమోదు చేసుకుంటే అకాల వర్షాలు వచ్చినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కి ఈ పంట నమోదు తప్పనిసరి అన్నారు. ధాన్యం కొనుగోలుకు కూడా ఈ పంట నమోదు తప్పనిసరి చేయించాలని, రైతుసేవ కేంద్రాలలో వీఏఏలు ఈ పంట నమోదు చేస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ పంట నమోదుకు ఆధార్, పంట పాస్‌బుక్ జీరాక్స్, ఫోన్ నంబరు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాలలో ఇచ్చి ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో తెలిపారు.

475 మందికి వైద్య పరీక్షలు

లంకపల్లి(ఘంటసాల): మండలంలోని లంకపల్లి గ్రామంలో దాత యార్లగడ్డ వెంకట కిరణ్ తల్లిదండ్రులు దివంగత యార్లగడ్డ శివరామకృష్ణ - జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నుంచి ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, డెంటల్, కార్డియాలజీ వైద్యులు ఉచిత వైద్య సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో 475 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు మార్కెటింగ్ మేనేజర్ కె.జోసఫ్ తెలిపారు. మాజీ ఎంపీటీసీ గువ్వాబత్తిన నాగేశ్వరరావు, దిరిశం వెంకట్రావు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, కొమ్మారెడ్డి లీలాకృష్ణయ్య, యార్లగడ్డ వీరభద్రరావు, గుత్తికొండ ప్రసాద్, కనమూరి సుబ్రహ్మణ్యం, కొల్లూరి సాయిరాం పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు ఎంపిక

చల్లపల్లి: స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో నర్రా సాయిబాబు రమాదేవి మల్టీపర్పస్ సెంటర్లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వెంకట్రావు మొత్తం 21 మందిని పరీక్షించి వారిలో తొమ్మిది మందిని ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గూడురులోని సాయి నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని రాజకుమార్, సెక్రటరీ వరదా హరిగోపాల్, కోశాధికారి నర్రా సాయిబాబు, సభ్యులు అంబటి శంకరరావులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం అందజేత

కోసూరువారిపాలెం(మోపిదేవి):మండల పరిధిలోని కోసూరువారిపాలెం పీఏసీఎస్ సభ్యులు కోసూరు వెంకట సుబ్బారావు శనివారం మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ తరపున స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు రూ.10 వేలు మృతుని కుమారుడు జగన్మోహనరావుకు అందజేశారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, సొసైటీ చైర్ పర్సన్ కోసూరు నాగమల్లేశ్వరావు, గొరిపర్తి పిచ్చేశ్వరావు, బడే నాగబసవయ్య, కోసూరు శివనాగమల్లేశ్వరావు, శీలం శ్రీరాములు పాల్గొన్నారు.

మల్లవోలులో గోపూజ

గూడూరు: కృష్ణా జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం మల్లవోలులో గోపూజా మహోత్సవం నిర్వహించారు. ధార్మిక సలహా మండలి సభ్యుడు తురగా ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలోని అభినవ గణపతి గోశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు హాజరయ్యారు. పూజా కార్యక్రమాలు, రామాంజనేయ భజన బృందం భజన, సంకీర్తన నిర్వహించారు. టీటీడీ పసుపు, కుంకుమ, గాజులు, కంకణాలు, గో మహత్యం పుస్తకాలు పంపిణీ చేశారు.

ముంపులోనే పొలాలు

- నీరు పోయే మార్గంలేక రైతుల అవస్థలు
- కోడూరు ప్రధాన పంటకాలువకు గండికొట్టిన రైతులు
- గండి కొట్టి కాలువల్లోకి నీటిని మళ్లిస్తున్న రైతులు
- లింగన్నకోడు డ్రెయిన్‌లోకి తూములు ఏర్పాటు చేయకపోవడమే సమస్య



ప్రధాన పంటకాలువకు రైతులు కొట్టిన గండి

కోడూరు: కోడూరు- అవనిగడ్డ ప్రధాన పంటకాలువకు రైతులు గండి కొట్టి తమ పంటపొలాలు ముంపుబారిన పడకుండా రక్షించుకొనే ప్రయత్నం చేశారు. నాలుగు రోజుల కితం కురిసిన భారీ వర్షాలకు వి.కొత్తపాలెం, మాచవరం, జయపురం గ్రామాల్లోని వరినారుమళ్లు, వరినాట్లు పూర్తిగా నీట మునగడంతో వాటిని రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. అయితే ప్రధాన మురుగు డ్రెయిన్లు మొత్తం ఎగతట్టి సముద్రం నీరు ఎగువ వైపునకు చొచ్చుకు రావడంతో వరిపొలాల్లో నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు.

నాలుగు రోజులు గడిచినా..

పొలాలు ముంపుబారిన పడి నాలుగు రోజులు దాటడంతో నారుమళ్లు, నాట్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో కాలువకు కుడి పక్కన ఉన్న ఆయకట్టు రైతులు కోడూరు- అవనిగడ్డ ప్రధాన పంటకాలువకు శుక్రవారం రాత్రి జేసీబీ సహాయంతో జయపురం సమీపంలో గండికొట్టారు. పొలాల్లో నీరు కంటే కాలువలో నీరే తక్కువగా ఉండడంతో ముంపు బారిన పొలాల్లో నుంచి గండి ద్వారా వర్షం నీరు కాలువలోకి చేరుతోంది. కాలువలో నీటి ఉధృతి లేకపోవడంతో గండి కొట్టి తమ పంటపొలాలను రక్షించుకున్నట్లు వి.కొత్తపాలెం, మాచవరం గ్రామాల రైతులు తెలిపారు. సుమారు రెండు వేల ఎకరాలకు సంబంధించిన వర్షం నీరు గండి ద్వారా కాలువలోకి చేరుతోందని రైతులు తెలిపారు.

తూములు ఏర్పాటు చేయాలని కోరినా..

తూముల ఏర్పాటు గురించి రైతులు అనేకమార్లు పాలకులు, అధికారులు విన్నవించినా పట్టించుకోలేదు. పాలకుల నిర్లక్ష్యంతో తమ పొలాలను రక్షించేందుకు కాలువకు గండి కొట్టాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే..

వి.కొత్తపాలెం, మాచవరం సమీప భూముల్లోని మురుగు నీరు రత్నకోడు క్యాచ్ డ్రెయిన్ ద్వారా మేజర్ డ్రెయిన్‌లోకి వెళ్తుంది. అయితే భారీ వర్షాల సమయంలో మేజర్ డ్రెయిన్ నిండుకుండలా మారడంతో పైగ్రామాల్లోని పొలాల్లో నీరు బయటకు వెళ్లని పరిస్థితి. దీనికి పరిష్కారంగా జయపురం సమీపంలో ప్రధాన పంటకాలువ కింద భాగం నుంచి ఎడవ వైపు ఉన్న లింగన్నకోడు డ్రెయిన్‌లోకి తూములు ఏర్పాటు చేయాలి. ఇలా తూములు ఏర్పాటు చేయడం వల్ల పొలాల్లో మురుగు రత్నకోడు మేజర్ డ్రెయిన్‌తో పాటు లింగన్నకోడు డ్రెయిన్‌లోకి కూడా ప్రవహిస్తుంది.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



పెడనలో గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కోడూరులో గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు



గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెడన: స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో గాంధీ విగ్రహం వద్ద సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి అఖిల పక్షం నాయకులు నివాళులర్పించారు. సర్దార్ గౌతులచ్చన్న విగ్రహ కమిటీ అధ్యక్షుడు బెజవాడ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పిచ్చిక సతీష్‌బాబు, వీరంకి నరసింహారావు, బీజేపీ నాయకులు జ్యోతీశ్వరరావు, మామిడి గుప్తా, కొల్లూరి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు చోడవరపు అప్పారావు, టీడీపీ మైనార్టీ నాయకులు అబ్దుల్ హమీదుల్లా, బీసీ నాయకులు జోగి రమేష్, బెల్లంకొండ లక్ష్మణ్, రాజులపాటి పైడేశ్వరరావు, వుసా జనార్దన్, రాజులపాటి శేషు, సురగాని శ్రీహరి పాల్గొన్నారు.

కోడూరు: సామాజిక న్యాయం కోసం కృషి చేసి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీసీ సంఘ నేతలు కొనియాడారు. గౌతు లచ్చన్న జయంతి వేడుకలను శనివారం కోడూరులో ఘనంగా నిర్వహించారు. అనంతరం నేతలు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మండలాధ్యక్షుడు కొండవీటి సురేష్, నేతలు అద్దంకి పాండురంగారావు, కొండవీటి రామకృష్ణ, వేముల వెంకటేశ్వరరావు, కాగిత రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలపూడి(మచిలీపట్నం): స్థానిక బస్టాండ్ సెంటరులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ సమావేశపు హాలులో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జి.రమేష్ జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణిదూర్జటి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంవీ శ్యామ్‌నాథ్, వై.నారాయణ పాల్గొన్నారు.

హే కృష్ణా.. ముకుందా.. మురారి

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

మచిలీపట్నంటౌన్: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నగర ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమను పూలతో అలంకరించి పూజలు చేశారు. గోవులను ప్రత్యేకంగా అలంకరించి గోపూజ చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంతమంది కర్రసామును ఉత్సాహంగా చేశారు. నగరంలోని ఇంగ్లిష్ పాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పాల సాయి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా పాల్గొన్నారు. వారు గోపూజ, శ్రీ కృష్ణుని పూజలో పాల్గొన్నారు. ఆనందోత్సాహాలతో ఉట్టి కొట్టారు. నగరంలోని యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పేర్ని కిట్టు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాలను ప్రసాదించాలని కోరారు. వరి సాగుకు యూరియా కొరతతో, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని ఆయన ప్రార్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, షేక్ మహమ్మద్‌సాహెబ్, హర్ష, యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లపాటి వెంకట్రావు (చినబాబు) తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: హంసలదీవి క్షేత్రంలో శ్రీకృష్ణుడి జన్మాష్టమిని పురస్కరించుకొని గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారి మూలమూర్తికి అభిషేకాలు చేశారు. నిజరూపదర్శనం కల్పించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న సమారాధన జరిపారు. అనంతరం స్వామివార్ల చిత్రపటాలను ప్రత్యేక వాహనంలోఊరేగించారు. ఊటగుండంలో స్వామివారి చిత్రపటాలతో ప్రదర్శన నిర్వహించారు. కోడూరులోని పెద్దివారి బజారులో యాదవుల వారి రామాలయం వద్ద స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చల్లపల్లి: మండల పరిధిలోని పలు ఆలయాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పడమరవీధిలోని పోతురాజు స్వామి ఆలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరి శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అలంకరించిన ఎద్దుల బండిపై కృష్ణుని విగ్రహాలు నిలిపి ఊరేగించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు. పోతురాజు స్వామి ఆలయ కమిటీ సభ్యులు కొలుసు రాము, గొరిపర్తి సంపత్‌కుమార్, గొరిపర్తి పూర్ణచంద్రరావు, డొక్కు సుబ్బారావు, శివరామకృష్ణ, సాంబయ్య తదితరులు పర్యవేక్షించారు.



హంసలదీవిలో ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలుడు

నాగాయలంక: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు దీవి వెంకట సత్యప్రసాద్ స్వామివార్లకు పంచామృతా భిషేకాలు, విశేష ఆరాధన జరిపి విశేష అలంకారంతో తీర్చిదిద్దారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని జమ్మిచెట్టు వద్ద గోపూజలు, ప్రదక్షిణలు చేశారు. భావదేవరపల్లి రామాలయం ప్రాంగణంలోని శ్రీకృష్ణభగవానుడికి అర్చకుడు వఝల నాంచారయ్య విశేషపూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్ పర్యవేక్షించారు. పలువురు తల్లులు తమ చిన్నారులను బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించారు.

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు శ్రీ కృష్ణాలయాలందు ప్రత్యేక పూజలు, భజనలతో గడిపారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాలు సందడిగా జరిగాయి. గాంధీనగరం గ్రామంలో ఉట్టికొట్టిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. పెదగొల్లపాలెంలో శ్రీకృష్ణుని ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులను రాధాకృష్ణులుగా అలంకరించి సందడి చేశారు.



మచిలీపట్నంలో ఉట్టి కొడుతున్న పేర్ని కిట్టు, చిత్రంలో సలార్ దాదా తదితరులు

బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. పెద తుమ్మిడి గ్రామంలో శ్రీరాధా రుక్మిణి సమేత శ్రీకృష్ణ స్వామి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం పలువురు దంపతుల దీక్షలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక గీతా మందిరంలో విష్ణు, లలితా సహస్రనామ పారాయణాలను పఠించి స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. బాసినపాడు, వెంకటనారాయణపురం, మల్లేశ్వరం గ్రామాల్లో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉట్టికొట్టే వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉట్టిగొట్టే కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘంటసాల: స్థానిక శ్రీకృష్ణ ద్వారాకాలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు, యాదవ యూత్ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కమిటీ సభ్యులు, యాదవ యూత్, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పెదప్రోలు(మోపిదేవి): మండలంలో శ్రీకృష్ణాష్టమి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పెదప్రోలులో గొరిపర్తి రవికాంత్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రంఊరేగింపు చేశారు. రాత్రి మోపిదేవి గొల్లపాలెంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేయగా, పలు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి



గుర్రపుబగ్గీలో గూడూరు పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీకృష్ణుడు

గూడూరు: శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని గూడూరులో శనివారం నిర్వహించారు. యాదవ రామాలయంలోని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు రథంపై స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా యువకులు కోలాటంతో ఆకట్టుకున్నారు. డీజే వాయిద్యాలు, మేళతాళాల మధ్య సాగిన ఊరేగింపు గాంధీబొమ్మ సెంటరు, వెంకటేశ్వరస్వామి ఆలయం కూడలి, ప్రధాన సెంటరు మీదుగా పటాన్‌పేట వరకు సాగింది. మల్లవోలు, యాదవ లేళ్లగరువు గ్రామాల్లో కృష్ణాష్టమి నిర్వహించారు.

పెడన పట్టణంలో శ్రీకృష్ణజన్మాష్టమి

పెడన: పట్టణంలో శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో వేకువజామున స్వామి వారి నిజరూప విగ్రహానికి సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదాన అర్చకుడు అగ్నిహోత్రం హరి కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహిళలు భగవద్గీతను పఠించారు. సాయంత్రం స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టేందుకు యువత ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.



పెడన వేణుగోపాల స్వామి ఆలయంలో భగవద్గీతను పఠిస్తున్న భక్తులు



ఘంటసాలలో యాదవ యూత్ ఆధ్వర్యంలో..



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో బహుమతుల పంపిణీ



చల్లపల్లిలో పోతురాజు స్వామి ఆలయం వద్ద..



చల్లపల్లి ఆర్యవైశ్య సంఘ భవనం గీతామందిరంలో..

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



బీసాబత్తుని ప్రసాద్

నాగాయలంక: నాట్లు పడిన వరి పొలాలు భారీ వర్షం ప్రభావంతో నాలుగు రోజులు గడిచినా మునక నుంచి బయట పోవడంతో అనేక మంది రైతులు లబోదిబోమంటున్నారు. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు బీసాబత్తుని ప్రసాద్ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. వరిపొలాల నష్టం అంచనాలు రూపొందించడంలో వ్యవశాఖ అధికారులు పత్తాలేరని ఆయన ఆరోపించారు. ప్రారంభ దశలోనే రైతులు వ్యవసాయ పనులకు పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి ప్రస్తుతం నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణం నష్ట పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

విశ్వనాథపల్లి యువకుడికి ‘ఉత్తమ విద్యార్థి’ అవార్డు



కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన తోట హరికృష్ణ ప్రసాద్‌కు కాకినాడకు చెందిన రాంగరాయ మెడికల్ కళాశాల ‘ఉత్తమ విద్యార్థి’ అవార్డును అందించింది. ప్రస్తుతం హరికృష్ణ రాంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వైద్య సదస్సు ఏరీనా 4.0కు ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు కళాశాల కార్యక్రమాల్లో అద్భుతమైన నాయకత్వం వహించడంతో ఈ అవార్డును అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ తెలిపారు. హరికృష్ణతో పాటు తల్లిదండ్రులు తోట రామ్మోహనరావు, కృష్ణకుమారిని కళాశాల యాజమాన్యం అభినందించింది. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ సేసీలు పాల్గొన్నారు.

రైతుల అభిమానం పొందాలి

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన పీఏసీఎస్ అధ్యక్షులకు శనివారం అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమించినట్టు చెప్పారు. రైతుల అభిమానం చూరగొనేలా వీరంతా పనిచేయాలని సూచించారు. యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావుతో పాటు పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంసాపత్రాలు



మంత్రి కొల్లు రవీంద్ర నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న మట్టా వెంకట ప్రత్యూష, అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్



కె.ఎస్.ప్రసాద్, ఎంఎంసీ ఇన్‌చార్జ్ మేనేజర్



వి.రాంప్రసాద్, ఎంఎంసీ డీఈ



మెట్ట శ్రీనివాసరావు, ఎంఎంసీ జూనియర్ అసిస్టెంట్



వీర నాగేశ్వరరావు, ఎంఎంసీ శానిటరీ సెక్రటరీ



ఎస్.పవన్ కుమార్, ఎంఎంసీ చైన్ మెన్



నితిన్ చంద్ర, ఎంఎంసీ జూనియర్ అసిస్టెంట్



జి.ప్రసన్నకుమార్, ఎంఎంసీ శానిటరీ మేస్త్రి



ఏ.సుకన్య, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఓఎస్



సీహెచ్ తులసి, ఆశా వర్కర్



జి.శివరామకృష్ణ, గూడూరు ఎంపీవో



జయంతి, జెడ్పీహెచ్ఎస్, హెచ్ఎం మోపిదేవి



పద్మకుమారి, సీనియర్ అసిస్టెంట్, మండల పరిషత్, గూడూరు



మైనంపూడి శ్రీనివాసరావు, అటెండర్, తహసీల్దార్ కార్యాలయం, గూడూరు



అహ్మద్ ఖాన్, వైద్యాధికారి, సీహెచ్‌సీ, గూడూరు



విజయశ్రీ, క్రాఫ్ట్ టీచర్, పెడన



అబ్దుల్‌హమీద్, ఆర్పీ, పెడన



వెంకటేశ్వరమ్మ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, పెడన



సీతారామాంజనేయులు, మున్సిపల్ ఏఈ, పెడన



కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్, పెడన



శివరామకృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్, పెడన



హెప్సిబారాణి, ఎంపీవో, మోపిదేవి

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలు శాఖల ఉద్యోగులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా ఎస్పీ గంగాధరరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను స్వీకరించారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న ఉద్యోగులను సహోద్యోగులు, బంధుమిత్రులు అభినందించారు.

– మచిలీపట్నంటౌన్/పెడన/గూడూరు/మోపిదేవి